2 టీఎంసీల సాగునీటిని అందించాలి

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి వినతి

ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్, జూలై 18: రిజర్వాయర్ల నుంచి తక్షణమే సాగునీటిని అందించాలని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షాలు సకాలంలో కురియక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సింగూర్ నుంచి ఘనపూర్ ఆనకట్టకు రెండు టీఎమ్‌సీల నీటిని విడుదల చేయాలని కోరారు. కొండపోచమ్మ సాగర్ నుంచి హల్దీ ప్రాజెక్టుకు ఒక టీఎమ్‌సీ నీటిని విడుదల చేయాలన్నారు. ఘనపూర్ నీటి కొరత కారణంగా నర్సాపూర్, మెదక్ నియోజక వర్గాల్లోని ఘనపూర్ ఆనకట్ట కింద దాదాపు 22 వేల ఎకరాలకు నీరు అందక ఇంకా పంటలు వేయలేదని తెలిపారు. ఈ విషయంలో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సానుకూలం గా స్పందిస్తూ అధికారులకు ఆదేశాలిస్తానని చెప్పారని తెలిపారు.

నీటిని విడుదల చేయాలి - సీఎంవోకు లేఖ రాసిన మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి

మెదక్, జూలై 18 (నమస్తే తెలంగాణ): సింగూరు ప్రాజెక్టు నుంచి ఘనపూర్ ఆనకట్టకు 2 టీఎంసీల నీటిని విడుదల చేయాలని మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి సెక్రటేరియట్‌లోని సీఎంవోకు లేఖ రాశారు. జిల్లాలో వర్షాలు కురువకపోవడంతో ఘనపూర్ ప్రాజెక్టు కింద ఆనకట్ట రైతులు నాట్లు వేయలేకపోతున్నారన్నారు. ప్రభుత్వం స్పందిస్తూ వెంటనే నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని కోరారు.

వేరే చోట భూమి ఇస్తేనే సహకరిస్తాం

రెడ్డిపల్లిలో అధికారులతో వాగ్వాదానికి దిగిన రైతులు

నర్సాపూర్, జూలై 18: ఆర్ఆర్ఆర్ కోసం భూములను వదులుకునే ప్రసక్తే లేదని, భూమికి భూమి ఇస్తేనే సహకరిస్తామని రీజినల్ రింగ్ రోడ్డు కోసం భూ సేకరణ సర్వేకొచ్చిన అధికారులతో రెడ్డిపల్లి రైతులు గురువారం తెలిపారు. మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలోని ఆర్ఆర్ఆర్ కోసం సర్వే చేయడానికి వచ్చిన అధికారులను రైతులు అడ్డుకుని నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రెడ్డిపల్లి గ్రామస్తులు ఇప్పటికే పలుమార్లు భూములు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, సీఐ జాన్‌రెడ్డి పలుమార్లు రైతులకు నచ్చజెప్పినా భూమి ఇచ్చేది లేదంటూ భీష్మించుకు కూర్చున్నారు. దాదాపు రెండు గంటల పాటు అధికారులకు రైతులకు వాగ్వాదం జరిగింది. సర్వే నిలిపేసి మరొక రోజు చేస్తామని అధికారులు వెళ్లిపోయారు.

ఆశ వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలి

ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు నర్సమ్మ

మెదక్ మున్సిపాలిటీ, జూలై 18: ఆశ వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేశారు. అనంతరం కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు నర్సమ్మ మాట్లాడుతూ కొంత కాలంగా సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఎన్నికల సమయంలో ఆశ వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు, ప్రమాద బీమా, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందన్నారు. హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో ఆశవర్కర్స్ మంజుల, లక్ష్మి, సావిత్రి, సుజాత, లావణ్య, ఉమారాణి తదితరులు పాల్గొన్నారు

రైతుభరోసాను వెంటనే వేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ

శివ్వంపేట, జూలై 18: కాంగ్రెస్ ప్రభుత్వం ఎగ్గొట్టిన రైతు భరోసా డబ్బులు వెంటనే ఖాతాల్లో వేయాలని మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ అన్నారు. గురువారం శివంపేటలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికలకు ముందు రైతులందరికీ రైతు భరోసా కింద ఎకరాకు రూ.15వేలు ఇస్తామని హామీ ఇచ్చి, అమలు చేయకుండా కాలం వెళ్లదీస్తున్నారన్నారు. రైతులంతా పెట్టుబడి సాయం కోసం ఎదురు చూస్తున్నారని, మాయమాటలు చెబుతూ కాలం వెళ్లదీస్తున్నారన్నారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ గౌడ్, మహేందర్ రెడ్డి, నవీన్ గౌడ్, మాజీ సర్పంచ్ బాలమణి నరేందర్, అశోక్‌రెడ్డి, మాజీ సర్పంచ్ భిక్షపతి, మాజీ ఎంపీటీసీ ఆనంద్, వెంకటేశ్ పాల్గొన్నారు.

నిజాంపేటలో ఉపాధి హామీ సామాజిక తనిఖీ

సామాజిక తనిఖీ ప్రజావేదికలో పాల్గొన్న డీఆర్డీవో పీడీ శ్రీనివాస్‌రావు

నిజాంపేట, జూలై 18: నిజాంపేటలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై డీఆర్డీవో పీడీ శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో గురువారం 3వ విడత సామాజిక తనిఖీ నిర్వహించారు. మండలంలోని 14 పంచాయతీల్లో ఏడాది కాలానికి ఉపాధి పథకంలో చేపట్టిన పనులు చెట్ల పెంపకం, చెరువు పూడికతీత, పశువుల పాకలు, కల్లాల నిర్మాణాలు, కొత్త రోడ్లు వంటి 129 పనులకు రూ.2.87 కోట్ల నిధులు ఖర్చు చేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఏపీడీ రంగచారి, ఎంపీడీవో రాజిరెడ్డి, డీవీవో శ్రీహరి, అసిస్టెంట్ డీవీవో సంపత్, ఎస్ఆర్పీ రమేశ్, జీవన్, ఎంపీవో రాజేందర్, ఏపీవో శ్రీనివాస్, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

ముదిరాజ్‌లను బీసీ ఏలో చేర్చాలి

తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ముదిరాజ్‌లు

అల్లాదుర్గం/కౌడిపల్లి, జూలై 18: ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి ఏలోకి మార్చాలని అల్లాదుర్గం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ సతీశ్‌కు వినతిపత్రం గురువారం అందజేశారు. రాష్ట్రంలో అత్యధిక జనాభా ఉన్న ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు కనుకంటి భూమయ్య అన్నారు. సంఘం ఉపాధ్యక్షుడు అంజయ్య, పట్టణ అధ్యక్షుడు రాములు, రాజు, లక్ష్మయ్య, సాయిలు, కృష్ణ, రాములు, నర్సింహులు, గోపాల్ తదితరులు ఉన్నారు.

కౌడిపల్లిలో..

ముదిరాజ్ సభ్యులు తహసీల్దార్ ఆంజనేయులు వినతి పత్రం అందజేశారు. చెరువు కుంటలు, మత్స్య సంపదపై ముదిరాజ్, గంగపుత్ర కులాలకు హక్కులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు గాండ్ల కృష్ణ, ఉపాధ్యక్షుడు రాజు, మల్లేశం, అశోక్, మహిపాల్, కుమార్, సాయికిరణ్, చంద్రశేఖర్, విఠల్ తదితరులు ఉన్నారు.

అటు రైతుల దీక్ష.. ఇటు కాంగ్రెస్ సంబురం

నర్సాపూర్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో రిలే నిరాహార దీక్ష చేస్తున్న రైతులు

నర్సాపూర్, జూలై 18: ఓ వైపు రైతులు భూములు కోల్పోతున్నామని రిలే నిరాహార దీక్షలు చేస్తుంటే.. మరోవైపు కాంగ్రెస్ నాయకులు సంబురాలు చేసుకుంటున్న ఘటన గురువారం నర్సాపూర్‌లో జరిగింది. కొండపోచమ్మ కాల్వ నిర్మాణంలో భాగంగా పొలాలు కోల్పోతున్నామని రైతులు వారం రోజులుగా పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో దీక్షకు కూర్చున్నారు. ప్రభుత్వం మొదటి విడత రూ.లక్ష రుణమాఫీ చేసిందని కాంగ్రెస్ నాయకులు అదే చౌరస్తాలో ర్యాలీ తీసి సంబరాలు జరుపుకొన్నారు. ఒకే చోట రెండు కార్యక్రమాలు చేపట్టడంతో చూసే జనాలు సంబురపడాలా.. బాధ పడాల అర్థం కాక అయోమయంలో పడ్డారు.

రైతులను పట్టించుకోకపోవడం బాధాకరం

వారం రోజులుగా దీక్ష చేస్తున్న రైతులను ఎవరూ పట్టించుకోకపోవడం చాలా దారుణమని రైతు రక్షణ సమితి జిల్లా గౌరవ అధ్యక్షుడు మైసయ్య యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఆయన దీక్ష చేస్తున్న రైతులకు సంఘీభావం తెలిపారు. దీక్షలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు యాదాగౌడ్, రైతులు నరసింహారెడ్డి, రామకృష్ణ, వెంకటేశ్, అంజాగౌడ్, అంజయ్య, పంతు, చుక్కయ్య, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

దశల వారీగా రుణమాఫీ

ప్రభుత్వం రైతులకు దశల వారీగా పంట రుణమాఫీ చేస్తుందని మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ తెలిపారు. రైతులతో కలిసి కాంగ్రెస్ నాయకులు సంబురాలు జరుపుకొన్నారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, సుహాసినిరెడ్డి, మల్లేశం, సురేశ్‌నాయక్ పాల్గొన్నారు.

రైతు ఋణమాఫీ నిధుల విడుదలపై వీడియో కాన్ఫరెన్స్

కొల్చారం, జూలై 18: కొల్చారం రైతు వేదికలో పంట రుణమాఫీ నిధులు విడుదల కార్యక్రమాన్ని అధికారుల సమక్షంలో గురువారం ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రులు నేరుగా రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి రాధాకిషన్, తహసీల్దార్ గఫర్‌మియా, ఎంపీడీవో లక్ష్మీ నర్సింలు, ఏవో స్వేతాకుమారి, ఏఈ హైమద్ అలీ, ఎస్ఐ మహమ్మద్ గౌస్, కాంగ్రెస్ నాయకులు సోమన్నగారి రవీందర్ రెడ్డి, నాగులగారి మల్లేశం గౌడ్, వెంకట్ గౌడ్, రైతులు పాల్గొన్నారు.

పాపన్నపేటలో..

పాపన్నపేట, జూలై 18: మండలంలోని మల్లంపేట రైతు వేదికలో పంట రుణమాఫీపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమంలో కొత్తపల్లి సొసైటీ చైర్మన్ రమేశ్, కాంగ్రెస్ రైతు కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

శివ్వంపేటలో..

శివ్వంపేట, జూలై 18: మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన కాన్ఫరెన్స్‌లో పాల్గొని సీఎం ప్రసంగం విన్నారు. కార్యక్రమంలో ఏవో లావణ్య, పీఏసీఎస్ చైర్మన్ వెంకటరాంరెడ్డి, నాయకులు నవీన్‌గుప్తా, గంగాధర్, శ్రీనివాస్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ కమలపూల్‌సింగ్, వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

రేగోడ్‌లో.....

రేగోడ్,జులై 18: మండలంలోని లింగంపల్లి రైతు వేదిక వద్ద పంట రుణ మాఫీ వీడియో కాన్ఫరెన్స్‌నురైతులు వీక్షించారు. మండల ప్రత్యేకాధికారి నరసింహారావు, సహకార శాఖ డైరెక్టర్లు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

రామాయంపేటలో..

రామాయంపేట, జూలై 18: రామాయంపేటలోని రైతువేదికలో పంట రుణమాఫీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

నర్సాపూర్: అంబేద్కర్ చౌరస్తాలో రుణమాఫీ సంబురాలు జరుపుకొంటున్న కాంగ్రెస్ నాయకులు

పాపన్నపేటలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం ప్రసంగం వింటున్న రైతులు

ప్రత్యేక అధికారి సత్యనారాయణ, ఏవోలు రాజ్‌నారాయణ, సతీశ్, విద్యుత్ ఏఈ.వెంట్యా నాయక్, పీసీసీ కార్యదర్శి చౌదరి సుప్రభాతరావు, పల్లె రాంచందర్‌గౌడ్, రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

హామీని నిలబెట్టుకున్న కాంగ్రెస్ - నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి

పెద్దశంకరంపేట/ అల్లాదుర్గం, జూలై 18: రైతులకు పంట రుణాల నుంచి విముక్తి కల్పిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన కాంగ్రెస్ నిలబెట్టుకున్నదని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని శివాయపల్లి శివారులో ఉన్న రైతువేదికలో నిర్వహించిన పంట రుణమాఫీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మధు, సురేందర్‌రెడ్డి, నారాగౌడ్, సత్యనారాయణ, వేణుగోపాల్,అర్జున్ పాల్గొన్నారు.

అర్హులందరికీ రుణమాఫీ అమలు

రుణమాఫీ వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులను కలిసి వీక్షిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

- కలెక్టర్ రాహుల్‌రాజ్

కౌడిపల్లి, జూలై 18: అర్హులైన ప్రతి రైతుకూ రుణమాఫీ వర్తిస్తుందని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రుణమాఫీపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 45 వేల కుటుంబాలకు 48 వేల ఖాతాలు ఉన్నాయని, రూ.241 కోట్లు విడుదలయ్యాయన్నారు. మాఫీ అయిన ప్రతిఒక్కరికీ మెసేజ్ వస్తుందన్నారు. మాఫీ కాని రైతులు అధైర్యపడొద్దని, ఏవైనా సమస్యలుంటే వ్యవసాయ అధికారులకు రాతపూర్వకంగా నివేదిస్తే సమస్య పరిష్కారమవుతుందన్నారు. కార్యక్రమంలో డీఏవో గోవింద్, ఏడీ పుణ్యవతి, సొసైటీ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, రైతులు ఉన్నారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త: ఎస్పీ

ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్, జూలై18: రైతు రుణమాఫీ అంటూ లింకులు వస్తే ఓపెన్ చేయవద్దని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు రుణమాఫీ కార్యక్రమాన్ని అదునుగా తీసుకుని సైబర్ నేరస్తులు ఏదో బ్యాంకు లోగోతో వాట్సప్‌లో ఏపీకే ఫైల్స్ పంపిస్తారని, వాటిపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ లింక్‌ను ఓపెన్ చేసినా లేదా యాప్‌ను ఇన్‌స్టాల్ చేసినా మన వాట్సప్, మన ఫోన్ వాళ్ల కంట్రోల్‌లోకి వెళ్తుందని, మనకు వచ్చే మెసేజ్‌లు, ఓటీపీలు అన్ని సైబర్ నేరగాళ్ల చేతిలోకి వెళ్తాయని అన్నారు. దీంతో సైబర్ నేరస్తులు మన గూగుల్‌పే, ఫోన్‌పే, యూపీఐ ద్వారా డబ్బులు దోచేస్తారని తెలిపారు. ట్రేడింగ్‌లో ఉన్న టాపిక్ ద్వారా ఏపీకే ఫైల్స్ పంపి డబ్బులు కొట్టేస్తున్నారని పేర్కొన్నారు. ఎవరైనా ఎదైనా సైబర్ నేరానికి గురయితే వెంట నే, ఎలాంటి ఆలస్యం చెయకుండా 1930కి కాల్ చేయాలని, లేదా www.cybercrime.gov.inలో రిపోర్ట్ చేయాలని సూచించారు.

వేరే ఎమ్మెల్యే ఫొటోతో సంబురాల నిర్వహణ

వెల్దుర్తి రైతువేదికలో ఏర్పాటు చేసిన బ్యానర్

వెల్దుర్తి, జూలై 18: వెల్దుర్తి రైతువేదికలో గురువారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రుణమాఫీ సంబరాల్లో ఏర్పాటు చేసిన బ్యానర్‌లో ప్రొటోకాల్ ప్రకారం స్థానిక ఎమ్మెల్యే సునీతా రెడ్డి ఫొటో కాకుండా మెదక్ ఎమ్మెల్యే ఫొటోతో బ్యానర్‌ను ఏర్పాటు చేయడం చర్చనీయాంశమైంది. పలువురు రైతులు గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లగా మధ్యలోనే బ్యానర్‌ను తొలిగించి కార్యక్రమాన్ని కొనసాగించారు. వ్యవసాయ అధికారుల అత్యుత్సహంతో ప్రొటోకాల్‌ను విస్మరించి కార్యక్రమం నిర్వహించడంపై మాజీ ఎంపీటీసీ మోహన్‌రెడ్డి మండిపడ్డాడు.

కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్, జూలై 18: మెదక్ జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఉదయ్‌కుమార్ రెడ్డి గురువారం కలెక్టర్ రాహుల్ రాజ్‌కు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు పాటుపడుతానన్నారు. కింది స్థాయి అధికారులతో సమన్వయం చేస్తూ ప్రజలకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు చేపడతామన్నారు.

ప్రాథమిక విద్య బలోపేతానికి చర్యలు

అమ్మమాట, అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో పాల్గొన్న ఐసీడీఎస్ పీడీ బ్రహ్మాజీ

- ఐసీడీఎస్ పీడీ బ్రహ్మాజీ

మెదక్, జూన్ 18 (నమస్తే తెలంగాణ): పూర్వ ప్రాథమిక విద్య బలోపేతానికి అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ పీడీ బ్రహ్మాజీ తెలిపారు. గురువారం రాజ్‌పల్లి గ్రామంలో అమ్మ మాట అంగన్‌వాడీ బాట ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రెండున్నరేండ్ల వయసున్న పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించి, పూర్వ ప్రాథమిక విద్యను అందించనున్నామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలను చేర్పించి వారి ఆరోగ్యం, విద్యపై దృష్టి సారించాలని సూచించారు. ఈ నెల 20 వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ర్యాలీలు, సమావేశాలు, అవగాహన, స్వచ్ఛ అంగన్‌వాడి, మొక్కలు నాటే కార్యక్రమాలతో పాటు చివరి రోజు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో మెదక్ సీడీపీవో కృష్ణవేణి, సూపర్‌వైజర్ మాధవి, అంగన్‌వాడీ టీచర్లు శ్రీవాణి, వెంకటలక్ష్మి, గర్భిణులు పాల్గొన్నారు.

నిజాంపేటలో..

నిజాంపేట, జూలై 18: నిజాంపేట మండలంలోని నందిగామలో 'అమ్మమాట-అంగన్‌వాడీ బాట' కార్యక్రమంలో భాగంగా చిన్నారులతో కలిసి ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ లక్ష్మీ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు.

అక్రమ బ్లాస్టింగ్‌లపై చర్యలు తీసుకోవాలి

తాళ్లపల్లిలో బ్లాస్టింగ్ చేసిన రాళ్లు

శివ్వంపేట, జూలై 18 : శివ్వంపేట పెద్దచెరువు సమీపంలో ఉన్న ఓ ఫామ్‌లో జరుగుతున్న అక్రమ బ్లాస్టింగ్‌లపై చర్యలు తీసుకోవాలని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, రైతులు కోరుతున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదారు రోజులుగా బ్లాస్టింగ్‌లు చేయడంతో వాటి శబ్దం దాటికి తాళ్లపల్లి తండా, సీత్యతండా ప్రజలు భయంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈ విషయమై ఇన్‌చార్జి తహసీల్దార్ షఫీయొద్దీన్‌ను వివరణ కోరగా తాము ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని పేర్కొన్నారు. అనుమతులు లేకపోతే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి తహసీల్దార్ తెలిపారు.

మాదకద్రవ్యాలపై జాగ్రత్త

సదస్సులో మాట్లాడుతున్న మెదక్ పట్టణ సీఐ నాగరాజు

రామాయంపేట: తెలంగాణ మాడల్ స్కూల్ విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తున్న సీఐవెంకటరాజగౌడ్

మెదక్ మున్సిపాలిటీ, జూలై 18: ఆరోగ్యానికి హాని కలిగించే మాదకద్రవ్యాల జోలికి విద్యార్థులు వెళ్లవద్దని మెదక్ పట్టణ సీఐ నాగరాజు అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డ్రగ్ వ్యతిరేక కమిటీ, పట్టణ పోలీస్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు మాదకద్రవ్యాలపై గురువారం అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాలు ఆరోగ్యంపై దుష్ప్రభావాలు చూపుతాయన్నారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. మాదకద్రవ్యాలను అడ్డుకట్ట వేయడానికి పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తున్నదన్నారు. కళాశాల డ్రగ్స్ వ్యతిరేక కమిటీ సమన్వయకర్త డాక్టర్ రమణకుమార్, కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్, కళాశాల అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్, అధ్యాపకులు శరత్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, విశ్వనాధం, మురళి, వేణుగోపాల్‌రావు పాల్గొన్నారు.

డ్రగ్స్‌ను సమూలంగా నిర్మూలించాలి

రామాయంపేట, జూలై 18: డ్రగ్స్‌ను సమూలంగా నిర్మూలించాలని రామాయంపేట సీఐ వెంకటరాజాగౌడ్ అన్నారు. గురువారం ప్రపంచ డ్రగ్స్ దినోత్సవం సందర్భంగా రామాయంపేటలోని తెలంగాణ మాడల్ స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

తూప్రాన్, జూలై 18: అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తూప్రాన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. రామాయంపేటకు చెందిన రాయారపు నరసింహాచారి (35) తన కుటుంబంతో కలిసి తూప్రాన్‌లో నివసిస్తున్నాడు. బంగారు ఆభరణాల తయారీ దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. నరసింహాచారి నాలుగేండ్ల క్రితం తూప్రాన్‌లో ఇల్లు కొనుక్కున్నాడు. తమ వద్ద ఉన్న డబ్బులు సరిపోక బ్యాంకులో రూ.17 లక్షలు, తెలిసిన వ్యక్తుల దగ్గర రూ.6 లక్షలు అప్పు తీసుకున్నాడు. ఆదాయ మార్గాలు లేక వడ్డీలు కట్టలేకపోయాడు. అప్పు పెరగడంతో నరసింహాచారి చెల్లించలేక మనస్తాపానికి గురయ్యాడు. దీంతో ఈనెల 17న బంగారం కరిగించడానికి ఉపయోగించే యాసిడ్ తాగాడు. ఇది గమనించిన పక్క దుకాణం యజమాని రమేశ్, కుటుంబీభ్యులకు సమాచారమందించాడు. మృతుడి భార్య కవిత, ఆమె మరిది నరేశ్ చికిత్స నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ దవాఖానకు, మెరుగైన చికిత్స కోసం మేడ్చల్‌లోని సంప్రద దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో నర్సింహాచారి మృతి చెందాడు. మృతుడి భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివానందం తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల దరఖాస్తుల గడువు పొడిగింపు

మెదక్ మున్సిపాలిటీ, జూలై 18: జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల ఎంపికకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీని ఈ నెల 21వ తేదీ వరకు పొడిగించినట్లు డీఈవో రాధాకిషన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కారం కోసం http://nationalawardstoteachers.education.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకుని, సంబంధిత దరఖాస్తుల రెండు ప్రతుల సెట్లను డీఈవో కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో బైక్ వేలం

నర్సాపూర్, జూలై 18: ఓ అబ్కారీ నేరంలో స్వాధీనపరుచుకున్న మోటార్ సైకిల్‌ను ఈ నెల 20న వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ పద్మ ఒక ప్రకటనలో తెలిపారు. టీఎస్ 08 ఈజెడ్ 7952 నెంబర్ కలిగిన హీరో గ్లామర్ మోటార్ సైకిల్‌ను నర్సాపూర్ ఎక్సైజ్ కార్యాలయం వద్ద జిల్లా మద్య నిషేధ, అబ్కారీ అధికారి మెదక్ అధ్వర్యంలో బహిరంగ వేలం వేసేందుకు నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు వాహనాన్ని ముందుగా తనిఖీ చేసుకోవచ్చని సూచించారు. వేలంలో పాల్గొనే వారు రూ.14,364 ధరావాత్తు చెల్లించి ఎంట్రీ పాసు పొందాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

ఆటో బోల్తా పడి నలుగురికి గాయాలు

రామాయంపేట ప్రభుత్వ దవాఖానలో చికిత్సలు పొందుతున్న క్షతగాత్రులు

రామాయంపేట, జూలై 18: రామాయంపేట శివారులోని విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రాంతంలో ఆటో అదుపుతప్పి బోల్తా పడిన ఘటన బుధవారం రాత్రి జరిగింది. పట్టణంలోని గురుకుల పాఠశాల విద్యార్థిని అస్వస్థతకు గురికావడంతో పాఠశాల సిబ్బంది, నర్సు విద్యార్థినిని ప్రభుత్వ దవాఖానలో చికిత్స చేయించారు. అనంతరం ఆటోలోనే గురుకుల వసతి గృహానికి వెళ్లే క్రమంలో మార్గమధ్యలో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో ఆటోలోని నలుగురికి గాయాలయ్యాయి. అందులో ఉన్న చిన్నారికి తీవ్ర గాయాలు కావడంతో వెంటనే రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించి, చికిత్స చేయిస్తున్నారు.

చెరువులో మునిగి వ్యక్తి మృతి

కొల్చారం, జూలై 18: చెరువులో మునిగి వ్యక్తి మృతి చెందిన ఘటన కొల్చారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పైతర గ్రామంలో గురువారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పైతర గ్రామానికి చెందిన తాటి మల్లేశం(54) గ్రామంలో పీర్ల పండగ ముగించుకుని, ఇంటికి వెళ్లే క్రమంలో రాత్రి సుమారు